క్లుప్తంగా

కూల్చివేతలు సరికాదు



న్యూశాయంపేట: కొడంగల్‌లో రోడ్డు వెడల్పు పేరుతో ముస్లి (ఖబ్రస్తాన్) శ్మశాన వాటిక, అషూర్‌ఖానాలను కూల్చివేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరంగల్ జమియత్ ఉలేమా ప్రతినిధులు తెలిపారు. హనుమకొండలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ చర్య.. ముస్లిం సమాజం మనోభావాల్ని తీవ్రంగా గాయపరిచిందని పేర్కొన్నారు. దోషులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జమైతుల్ ఉలేమా అధ్యక్షుడు మహ్మద్ మంజూర్ అహ్మద్ ఖాస్మీ, మహ్మద్ నయీం, ఎండీ.తాజోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులకు సన్మానం




ఖిలా వరంగల్: ఆర్పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ రిటైర్డ్ అధికారులను శుక్రవారం సన్మానించారు. ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై ఎంవీ.రావు, స్టేషన్ మాస్టర్ సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

రౌతు రమేష్‌కు..



కాజీపేట అర్బన్: ఉద్యోగ విరమణ పొందిన విద్యుత్ ఉద్యోగి, దళిత బహుజన ఫ్రంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్‌ను మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో సన్మానించారు. కార్యక్రమంలో ఐజేయూ జాతీయ నేత, ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి, జర్నలిస్ట్ కన్నా పరశురాములు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు పాల్గొన్నారు.

కేయూ ఎస్‌డీఎల్‌సీఈ ఉద్యోగి కళ్యాణికి..



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్యా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తూ ఈనెలాఖరున ఉద్యోగ విరమణ పొందబోతున్న దండపంతుల కళ్యాణిని వివిధ ఉద్యోగ సంఘాల బాధ్యులు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో బూర నవీన్‌కుమార్, తిరుపతి, తిరుమల్‌సింగ్, వలీపాషా, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

మడికొండ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలోని నమిండ్ల నాగరాజుకు చెందిన ఇల్లు కూలిపోయింది. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నాయకులు వస్కుల శంకర్, నాగరాజు, భిక్షపతి పరామర్శించారు.

అండర్ బ్రిడ్జి ప్రాంతంలో వర్షం

ఖిలా వరంగల్: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రైల్వేగేట్ ప్రాంతంలో గురువారం, శుక్రవారాల్లో ఎడతెరిపిలేని వర్షం కురిసింది. దాంతో శివనగర్‌లోని పలు కాలనీల్లోని డ్రెయినేజీలు పొంగి రోడ్లన్నీ జలమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. బల్దియా అధికారులతో కలిసి వరద నీటిని స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి పరిశీలించారు. నీరు మళ్లింపునకు వెంటనే చర్యలు తీసుకున్నారు.


ఎన్నికలకు వెళ్లడం బాధాకరం

ఖిలా వరంగల్: వరంగల్ మండల రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గానికి ఇంకా పదవీ కాలం ఉండగానే డీలర్లు ఎన్నికలకు పోవడం బాధాకరమని ఆ సంఘం అధ్యక్షుడు బి.సంపత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మామునూరు: కుటుంబ కలహాలతో మనస్థాపం చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం జక్కలొద్ది గుడిసెల్లో చోటు చేసుకుంది. దుగ్గొండి మండలం మండలం ముద్దునూరు గ్రామానికి చెందిన తోకల విజేందర్ రామన్నపేటలో కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దాంతో ఇద్దరు కుమార్తెలతో కలిసి భర్తకు దూరంగా హారిక ఉంటోంది. విజేందర్ జక్కలొద్ది గుడిసెల్లో ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్థాపంతో శుక్రవారం మధ్యాహ్నం నివాసం ఉంటున్న గుడిసెలోనే ఫ్యాన్‌కు ఊరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి తోకల వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపారు.

చెన్నారావుపేటలో వర్షాలకు ఎరుపెక్కిన పత్తిపంట



దిగుబడి దిగులు

వర్షాలతో ఎరుపెక్కిన పత్తి పంట

- రాలిపోయిన పూత, కాత
- పెట్టుబడి కూడా రాని పరిస్థితి
- ఆందోళన చెందుతున్న రైతులు
- వరంగల్ జిల్లాలో 1,18,106 ఎకరాల్లో పత్తిసాగు

ఖిలా వరంగల్: అధిక వర్షాలు పత్తి పంటను అతలాకుతలం చేస్తున్నాయి. మరో వారం పది రోజుల్లో పత్తి ఏరి కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్దామనుకున్న రైతులు.. వరుసగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన చెందుతున్నారు. వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,18,106 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. సుమారు 2 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోళ్ల కోసం సీసీఐ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి క్వింటాలుకు ప్రభుత్వం అదనంగా రూ.589 పెంచింది. పెంచిన ధర ప్రకారం ప్రస్తుతం క్వింటాలుకు మద్దతు ధర రూ.8,110 చెల్లిస్తారు. కానీ, ఆగస్టు వరకు ఏపుగా పెరిగిన పత్తి చెట్లు సెప్టెంబర్ ఆరంభం నుంచి కురుస్తున్న వర్షాలకు భూమి జాలువారి ఆకులు ఎరుపెక్కుతున్నాయి. పూతకాత మొత్తం రాలిపోయింది. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి పంట జాలువారడంతో 8 క్వింటాళ్లలోపు మాత్రమే దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

వరంగల్ జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున పత్తి పంట జాలువారకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పత్తి పంటలో తక్షణమే కాల్వలు ఏర్పాటుచేసి నీటిని బయటకు పంపించాలి. వరుసల మధ్యలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. వర్షాలు తగ్గిన తర్వాత గొర్రు, గుంటుక తోలాలి. వేర్లకు గాలి లేదా ఆక్సిజన్ అందేలా చూడాలి. పంట అవశేషాలు, గడ్డిని పాలిథిన్ షీట్‌తో మల్చింగ్ చేయాలి. ఎకరాకు 10–15 కిలోల యూరియా వేయాలి. అదేవిధంగా రెండు శాతం యూరియా స్ప్రే చేయాలి. అలాగే, 19–19–19 ఎరువు (రెండు శాతం) స్ప్రే చేసి పత్తి చెట్లు వడలి పోకుండా చూడాలి. మొక్క ఆకులు ఎర్రబడి, పూత, కాయలు రాలిపోవడం వంటివి గమనించినప్పుడు ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్, ఒక శాతం పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి. ఆకులు పసుపు రంగులోకి మారితే జింక్ సల్ఫేట్ 0.5 శాతం పిచికారీ చేయాలి. కాయలు కుళ్లిపోయి, ఆకుమచ్చ తెగులు వస్తే మూడు గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్‌ను లీటరు నీటికి, కార్బెండజిమ్, మాంకోజెబ్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వేరుకుళ్లు లాంటి లక్షణాలు కనిపిస్తే 2.5 కిలోల ట్రికోడెర్మా విరిడి వేర్ల చుట్టూ పిచికారీ చేయాలి. పూత రాలితే ఒక శాతం పొటాషియం నైట్రేట్ లేదా ఎన్ఏఏ (10 పీపీఎం) స్ప్రే చేయాలి.

వర్షాలతో ఆందోళన చెందొద్దు



వర్షాలు తగ్గగానే పంటలో నత్రజని కోతకు గురవుతుంది. పత్తి పంటలో నిలిచిన నీటిని కాల్వల ద్వారా తొలగించాలి. తర్వాత పంటలో గుంటుక తోలాలి. వేర్లకు గాలి లేదా ఆక్సిజన్ అందేలా చూడాలి. ఎకరాకు 10–15 కిలోల యూరియా వేయాలి. రైతులు ఆందోళన చెందొద్దు. తగు జాగ్రత్తలు పాటిస్తే పత్తి చెట్టు ఎరుపు రంగు మారి కాతపూత పెరుగుతుంది.

– డాక్టర్ ఆర్.అరుణ్‌జ్యోతి, కేవీకే శాస్త్రవేత్త, మామునూరు

జీపీ కార్మికులకు అందని వేతనాలు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

హన్మకొండ అర్బన్: గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో వారు పండుగ పూట పస్తులు ఉండాల్సిందేనా అని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) జిల్లా గౌరవ అధ్యక్షుడు చక్రపాణి ప్రశ్నించారు. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించి బతుకమ్మ ఆటపాటలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గబ్బెట యాకయ్య, ప్రధాన కార్యదర్శి పల్లె రామన్న, నాయకులు బండ సాంబయ్య, రమేష్, పురుషోత్తం, కోమల, కవిత, పోలమ్మ, మొగిలి, శ్రీకాంత్, ఐలయ్య, రంజిత్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న దాతలు

హసన్‌పర్తి: బతుకమ్మ సంబురాలను పురస్కరించుకుని ఒకటో డివిజన్ ముచ్చర్లలో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, చల్లా కుమార్‌రెడ్డి సహకారంతో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు పెద్ది ఇంద్రాసేనా రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, ఓరుగంటి గణపతి రెడ్డి, సమ్మిరెడ్డి, దామెర శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడి తగ్గించడానికి యోగా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సునీత

హసన్‌పర్తి: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడానికి కళాశాలలో యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి అధ్యాపకులు విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. వివిధ పోటీ పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు పలు సూచనలు చేశారు. సమావేశంలో కళాశాల విద్యా కమిటీ కోశాధికారి చకిలం రాజేశ్వర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా గోవిందు



కాజీపేట అర్బన్: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన మహానామ గోవిందు నియమితులయ్యారు. ఈ మేరకు సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొచ్చు చందర్ ఒక ప్రకటన తెలిపారు

ఎస్సార్‌లో బతుకమ్మ సంబురాలు



హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మలను యూనివర్సిటీ ఆవరణలో ఉంచి వాటి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో ఎస్సార్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ దీపా, డాక్టర్ సూరజ్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో..

హసన్‌పర్తి: నగరంలోని కిట్స్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు బతుకమ్మ ఆడుతూ సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీలత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ గౌతమి, డాక్టర్ మూర్తి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ప్రభాకరాచారి తదితరులు పాల్గొన్నారు.

అవసరార్థులకు చేయూతనివ్వాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న బాలథెరిస్సా, దాతలు

కాజీపేట రూరల్: బాలవికాస సంస్థ ద్వారా సహాయం పొందిన వారు అవసరార్థులకు చేయూతనివ్వాలని బాల వికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ సూచించారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస పీపుల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం వికాస బాలల వార్షిక సదస్సు జరిగింది. బాలవికాస అర్బన్ సాల్లారిటీ క్లబ్, సోపర్ సహకారంతో 215 మంది అనాథలకు సుమారు రూ.22 లక్షల ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా బాలథెరిస్సా మాట్లాడుతూ వికాస చిల్డ్రన్స్ పథకం ద్వారా అనాథ బాలలకు విద్యాభ్యాసానికి తమ వంతు సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో వెల్త్ ఫస్ట్ ఫిన్ సర్వే వ్యవస్థాపకుడు రమణ గుప్తా, కేఎంసీ ఆర్ఎంఓ డాక్టర్ రోషన్, బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి, బాలవికాస ప్రోగ్రాం మేనేజర్ లత, సోపార్ డైరెక్టర్ శోభాసింగారెడ్డి, సోపార్ సంస్థ డైరెక్టర్ బెర్నార్డ్, కెనడా నుంచి వచ్చిన దాత మోనిక్ పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి సహకరించాలి



హన్మకొండ చౌరస్తా: కాలనీల అభివృద్ధికి సహకరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. హనుమకొండలోని అశోకా కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగిన బాలసముద్రం కాలనీ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి కాలనీ కమిటీ అధ్యక్షుడు నామిరెడ్డి సీతారాంరెడ్డి, సభ్యులు మాజీ మేయర్ రాజేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, చిట్టిరెడ్డి రాంరెడ్డి, కట్కూరి దేవేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రావుల కిషన్, శ్యాం సుందర్‌రెడ్డి, వెంకట్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్‌లోని పోచమ్మగుడి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి కాలనీ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్, కాంగ్రెస్ నాయకులు ఎండీ.అంకూస్, సిరిల్‌లారెన్స్, కాలనీ కమిటీ అధ్యక్షుడు మర్యాల కృష్ణ, అరుంధతి మాదిగ సంఘం అధ్యక్షుడు సిలువేరు విజయభాస్కర్, జాంబవ సంఘం అధ్యక్షుడు ఇమ్మడి రవి పాల్గొన్నారు.

వరంగల్ నుంచి మళ్లీ పోటీ చేస్తా



మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

నయీంనగర్: వరంగల్ నుంచి మళ్లీ ఎంపీగా పోటీ చేస్తానని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్‌రావ్ అంబేద్కర్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఉదయం దినపత్రిక కరీమాబాద్ పూర్వ పాత్రికేయుడు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌ను హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు దాసరి కృష్ణారెడ్డి, పాత్రికేయుడు కన్నా పరశురాములు, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ పాత్రికేయుడిగా గడించిన అనుభవంతో తాను ప్రభుత్వ ఉద్యోగం పొంది అంచెలంచెలుగా ఎదిగి ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో ప్రొఫెసర్ పదవి చేపట్టానన్నారు. 2015లో ఎంపీగా పోటీ చేసి ఓటమిపాలైనా నిరుత్సాహ పడలేదని అన్నారు. కార్యక్రమంలో పూర్వ పాత్రికేయులు లక్ష్మణ్ సుధాకర్, పి.వెంకటేశ్వర్‌రావు, రామారావు, పెండెం వేణుమాధవ్ రావు, రౌతు రమేష్, శ్రీధర్, సదానందం పాల్గొన్నారు.

మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ చౌరస్తా: క్రెడాయి, తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ రన్నర్స్ అసోసియేషన్ సౌజన్యంతో నవంబర్ 23న నిర్వహించే హాఫ్ మారథాన్‌లో నగర ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మారథాన్ వాల్‌పోస్టర్లను ఎమ్మెల్యే నాయిని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 21 కిలోమీటర్ల మారథాన్‌ను హెరిటేజ్ సిటీలో నిర్వహించడం వల్ల ప్రపంచానికి తమ సంపదను చూపించవచ్చని అన్నారు. మారథాన్ 5 కేఎం, 10 కేఎం, 21 కేఎం మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, క్రెడాయి వరంగల్ అధ్యక్షుడు నాయిని అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, రజనీకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమరేందర్, సంయుక్త కార్యదర్శి వెంకట మల్లారెడ్డి, పొద్దుటూరి రిక్షిత్‌రెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ బాధ్యులు సోమ జగన్మోహన్‌రెడ్డి, సాంబారి రవి, చరణ్, సరస్వతి, డాక్టర్లు కొల్లా సుధాకర్, తులసి తదితరులు పాల్గొన్నారు.

19న నరకాసుర వధ నిర్వహిస్తాం



ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో అక్టోబర్ 19న ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నరకాసుర వధ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. కరీమాబాద్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 23 ఏళ్లుగా నరకాసుర వధ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కనుకుంట్ల రవి, ఆవునూరి రామ్మూర్తి, దూడే బాలమురెళ్లి, మరుపల్లి గౌతం, సాంబమూర్తి, వనం కుమార్, ఆవునూరి రామన్న, శెట్టి మోహన్, ఆవునూరి మల్లేశం, శివ, రామ్ పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు నివాళి



ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, తదితరులు



టీజీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో..



హనుమకొండ రాంనగర్‌లో నివాళులర్పిస్తూ..



మడికొండ చౌరస్తాలో..



కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో..




సీపీఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో..

ప్రకృతి స్వరూపిణి.. జగన్మాత



పూజలో ఎమ్మెల్యే నాయిని, మేయర్ సుధారాణి



లలితానిత్యగా..



స్కందమాతగా..

హన్మకొండ కల్చరల్: ప్రకృతి స్వరూపిణి జగన్మాత విశ్వమంతా వ్యాపించి ఉన్నదని వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ పేర్కొన్నారు. రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఐదో రోజు శుక్రవారం ఉదయం ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చకులు ప్రభాతసేవ, స్వామివారికి అభిషేకాలు చేసి అమ్మవారికి నిత్యాహ్నికం, షోడశోపచార పూజలు నిర్వహించి లలితా మహాత్రిపుర సుందరిగా అలంకరించి పూజలు చేశారు. నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమా దంపతులు పాల్గొన్నారు.

లలితానిత్యగా రాజరాజేశ్వరి అమ్మవారు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో ఆలయ అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లలితానిత్యగా శుక్రవారం అలంకరించారు. సౌందర్య లహరి పారాయణం, లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

స్కందమాత అలంకరణలో పద్మాక్షి దేవి

హన్మకొండ అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి ఆలయంలో పద్మాక్షిదేవి స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ పండితుడు నాగిళ్ల షణ్ముక పద్మనాభ అవధాని తెలిపారు. అనంతరం చండీహోమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

మహాత్రిపుర సుందరి అలంకరణలో..



త్రిపుర సుందరిగా..

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయం ప్రాంగణంలోని లలితాదేవి అమ్మవారిని మహాత్రిపుర సుందరిగా అలంకరించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా లలితాదేవిని పసుపు కొమ్ములతో అలంకరించి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వొడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీరాం రాజేష్, ఆడెపు శ్యామ్, బత్తుల నవీన్, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమ పూజ

కాజీపేట అర్బన్: దుర్గామాతదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో ఆలయ పూజారి జాగర్లపూడి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలు శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు.

హసన్‌పర్తి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 55వ డివిజన్ భీమారంలోని సత్యసాయి కాలనీలో భక్తిశ్రద్ధలతో శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో తుమ్మ వనమాల, సరిత, నిర్మల, దివ్య, విజయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.